క్లుప్తంగా

వైభవంగా రథయాత్ర



పెదకాకాని: ఇస్కాన్ మంగళగిరి ఆధ్వర్యంలో పెదకాకానిలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవాలయం నుంచి వీవీఐటీ వరకు పూరి జగన్నాథ రథయాత్ర భక్తిశ్రద్ధలతో సాగింది. శివాలయం వద్ద బుధవారం శోభాయమానంగా అలంకరించిన రథంపై స్వామివారిని ఏర్పాటు చేశారు.వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బంగారు చీపురుతో ఊడ్చి రథ యాత్రను ప్రారంభించారు. వీవీఐటీ విద్యార్థులతో పాటు పెద్దఎత్తున భక్తులు, ఇస్కాన్ సభ్యులు హాజరయ్యారు. హరే రామ హరే కృష్ణ అంటూ సంకీర్తనలు, కోలాటాలు, నృత్యాలతో రథయాత్ర వైభవంగా సాగింది. వీవీఐటీ కళాశాలకు చేరుకోగానే ఇస్కాన్ టెంపుల్ సభ్యులు విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రను దిగ్విజయం చేశారు. పూరిలో నిర్వహిస్తున్న జగన్నాథుని రథయాత్రకు సంఘీభావంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ పేర్కొన్నారు. యాత్రలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, మంగళగిరి ఇస్కాన్ సభ్యులు, పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష విజయవంతమే లక్ష్యం



వేజండ్ల(చేబ్రోలు): ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చేబ్రోలు మండల జేసీఎస్ కన్వీనర్ కుర్రా పాములు తెలిపారు. చేబ్రోలు మండలం వేజండ్ల ఆర్‌బీకేలో బుధవారం వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లుతో జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. బీఎల్‌వో మహేష్ మాట్లాడుతూ నెల రోజుల పాటు జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు క్రియాశీలకంగా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఇంకా సంక్షేమ పథకాలు అర్హులై ఉండి అందని వారి వివరాలు సేకరించాలని చెప్పారు. కార్యక్రమంలో కాసు ఈశ్వరరెడ్డి, వీఆర్వో కె. ప్రసాద్ పాల్గొన్నారు.

వాతావరణం కూల్..కూల్



ప్రత్తిపాడు: వాతావరణం చల్లబడింది. భానుడి భగభగలు తగ్గాయి. వరుణుడు కరుణించాడు. బుధవారం ఉదయం నుంచి వాతావరణం చల్లబడటంతో పాటు సాయంత్రానికి ప్రత్తిపాడులో కుండపోత వర్షం కురిసింది. భారీ ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో సుమారు గంటలకు పైగా వర్షం కురిసింది. మండు వేసవి తరువాత చల్లని వర్షం కురవడంతో ప్రజలు కాస్తంత ఉపశమనం పొందారు.

ఉప శమనం కల్పించిన చిరు జల్లులు

నెహ్రూనగర్: ఈ వేసవిలో ఎండలు నగర ప్రజల్ని ఠారెత్తించాయి.భానుడి తీవ్రత 48 డిగ్రీల దాకా వెళ్లింది. గత 20 రోజులుగా భానుడి సెగలకు ఇంట్లోంచి బయటకు రాలేని పరిస్థితి. ఉదయం 7 గంటల నుంచే భానుడి భగభగలు, వడగాలులకు తీవ్ర ఇబ్బందులు పడిన నగరవాసులకు బుధవారం కురిసిన వర్షం కాసింత ఉపశమనం కలిగించింది. మంగళవారం మధ్యాహ్నం మేఘాలు కమ్మి వాతావరణం చల్లగా మారింది. చిన్న చిన్న జల్లులు పడి ఆగిపోవడంతో ఎండలు ప్రభావం తగ్గలేదేమో అని ఆందోళనలో ఉన్న నగరవాసులకు బుధవారం సాయంత్రం కురిసిన వర్షంతో హమ్మయ్య అనుకున్నారు.

ఏఎన్‌ఎంలు పరీక్షలు చేయడంపై డీఎంహెచ్‌వో ఆరా

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: ఎఫ్‌పీసీ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు రోగులకు పరీక్షలు చేయడంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రవణ్ బాబు ఆరా తీశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు చెయ్యవలసిన పరీక్షలు ఏఎన్‌ఎంలు చేస్తున్నారని, వైద్యాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారంటూ బుధవారం సాక్షి లో ప్రచురితమైన ఇష్టానుసారం వైద్యపరీక్షలు కథనంపై డీఎంహెచ్‌వో స్పందించారు. పూర్తి వివరాలతో వివరణ ఇవ్వాలని గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారుల్ని ఆదేశించారు. అలా చేయడానికి వీల్లేదని, వైద్యాధికారులు వివరణ ఇచ్చిన తరువాత నిర్ణయం తీసుకుంటామని డీఎంహెచ్‌వో సాక్షికి స్పష్టం చేశారు.

సమన్వయలోపం వల్లే సమస్యలు

ఎంపీడీవో, హౌసింగ్ ఏఈల తీరుపై జిల్లా పంచాయతీ అధికారి అసహనం



ప్రత్తిపాడు లేఅవుట్‌లో సమస్యలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ప్రశ్నిస్తున్న డీపీవో కేశవరెడ్డి. వేదికపై ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ తదితరులు

ప్రత్తిపాడు:మీ మధ్య పూర్తిగా సమన్వయం లోపం ఉంది.. అందువల్లే పదేపదే సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ మీటింగులో చర్చించిన విషయాన్ని పూర్తయ్యాక వదిలేస్తున్నారు. మళ్లీ నేను వచ్చి పెట్టి అడిగే వరకూ చెప్పడం లేదంటూ ఎంపీడీవో శ్రీరమ్య, హౌసింగ్ ఏఈ సురేష్‌ల తీరుపై జిల్లా పంచాయతీ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ ఆర్. కేశవరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. డీపీవో గ్రామాల వారీగా గృహ నిర్మాణాలపై సమీక్షించారు. గత సమావేశంలో ఉన్న ప్రగతి నివేదికలే తప్పా, పురోగతి కనిపించకపోవడంపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఆగ్రహించారు. పురోగతి లేకపోవడం వల్ల జిల్లాలో మండలం వెనుకబడిందని, తాను తలదించుకోవాల్సి వస్తుందని మండిపడ్డారు. అనేక సమీక్ష సమావేశాల్లో ప్రత్తిపాడు హౌసింగ్ లేఅవుట్‌లో లబ్ధిదారుల ఇళ్లకు మార్కింగ్ ఇచ్చి హద్దురాళ్లు వేయాలని చెబుతున్నా, పట్టించుకోకపోవడంపై డీపీవో ప్రశ్నించారు. కేవలం ఎంపీడీవో, హౌసింగ్ ఏఈల సమన్వయలోపంతోనే సమస్యలు అధికమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఇలా కుదరదని, కచ్చితంగా ప్రతి వారం పురోగతి కనిపించాల్సిందేనని తేల్చి చెప్పారు. సమావేశంలో ఏపీఎం సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీలో అప్రమత్తత అవసరం



హాజరైన బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న ఓటర్ల నమోదు అధికారి హరిహరనాథ్, తహసీల్దార్

పొన్నూరు అసెంబ్లీ సెగ్మెంట్ ఓటర్ల నమోదు అధికారి వై. హరిహరనాథ్

చేబ్రోలు: రానున్న జనవరిలో రూపకల్పన చేసే ఓటర్ల జాబితాపై సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టాలని పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి వై .హరిహరనాథ్ ఆదేశించారు. చేబ్రోలులోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం పత్యేక సంక్షిప్త సవరణ– 2024కి సంబంధించి మండల పరిధిలోని అన్ని గ్రామాల బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఓటర్ల నమోదు అధికారి మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీలో ఎన్నికల సంఘం తెలియజేసిన అంశాలను కచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. మరణాలు, శాశ్వత వలస, డూప్లికేటు ఓట్లను తొలగించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటర్లుగా చేర్చాలని సూచించారు. బీఎల్‌వోలు, సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టి, అందుకు అనుగుణంగా రిజిస్టర్లను తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.బి.గోపాలకృష్ణ, ఎన్నికల డీటీ ఫణి కుమార్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శారీరక, మానసిక వికాసానికి యోగా దోహదం



ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు



విజ్ఞాన్ యూనివర్సిటీలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, సిబ్బంది



విజ్ఞాన్ నిరుల ఇంజినీరింగ్ కళాశాలలో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

గుంటూరు రూరల్: శారీరక, మానసిక వికాసానికి యోగా సాధన ఎంతో ఉపయోగడపడుతుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్ని బుధవారం చౌడవరంలోని కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు దేశ ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వం వహించడం హర్షణీయమని పేర్కొన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ, నైపుణ్యాభివృద్ధికి యోగా సాధన ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు యోగా గురువులు శిక్షణ తరగతులు నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో ఫైనాన్స్ డాక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, మెడిటేషన్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో...

ప్రస్తుత మానవ జీవన విధానంలో యోగా ఎంతో అవసరమని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. పెదపలకలూరులోని కళాశాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి విద్యార్థి రోజూ కనీసం గంట సేపు యోగా, మెడిటేషన్ చేయడం వల్ల జ్ఞాపకశక్తి పెరిగి మంచి మార్కులు సాధించవచ్చని చెప్పారు. ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిప్స్ కళాశాలలో...

యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విద్యాధర్ తెలిపారు. చౌడవరంలోని చిప్స్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆఫీసర్ డాక్టర్ జె. సుబ్బారావు పర్యవేక్షణలో విద్యార్థులకు యోగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో యోగా టీచర్ కొండ శ్రీలత, కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, కార్యదర్శి సి.ఎస్. శ్రీనివాస్, కోశాధికారి ఆర్. గోపాలకృష్ణ పాల్గొన్నారు.



మలినేని కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

కళ్లం కళాశాలలో...

యోగా సాధన ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పొందవచ్చని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాశంకర్‌రెడ్డి మాట్లాడుతూ యోగా సాధన ద్వారా శ్వాస ప్రక్రియలో ఇబ్బందులు లేకుండా శరీరానికి కావాల్సిన ఆక్సిజన్‌ను అందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎస్.బి.రెడ్డి, డాక్టర్ ఎస్. సూర్యనారాయణ, పీడీ డాక్టర్ పి.పున్నారెడ్డి, సీహెచ్. శ్రీనివాసరావు, డి. శ్రీనివాసులు, జి. రాజు పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీ కళాశాలలో...

నగర శివారుల్లోని చలపతి ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ఆర్ట్స్ అండ్ కల్చరల్, ప్రధాన మంత్రి జన ఔషధ కేంద్రం, ఇస్సార్ ఇండియా అమరావతి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు, డాక్టర్ సీతాప్రసాద్, వి. సుజాత పాల్గొన్నారు.



మిట్టపల్లి ఇంజినీరింగ్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

విజ్ఞాన్స్ యూనివర్సిటీలో యోగా డే

చేబ్రోలు: యోగాతో ఏకాగ్రత, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఒత్తిడి దూరమవుతుందని గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం. చంద్రశేఖర్ తెలిపారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో బుధవారం ఇంటర్నేషనల్ యోగా డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్నల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల శరీరంలోని రుగ్మతలన్నీ తొలగిపోయి ప్రాణశక్తి పెరుగుతుందని తెలిపారు. గుంటూరు గ్రూప్ ట్రెనింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ ఆధునిక జీవన శైలిలో ఒత్తిడిని తట్టుకుని ఆహ్లాదకరమైన జీవితాన్ని గడిపేందుకు నిత్యజీవితంలో విద్యార్థులు యోగాను సాధనంగా మార్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతుల్ని అందజేశారు. కార్యక్రమంలో 25ఏ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ సీఎస్ సిద్ధు, డాక్టర్ సురేష్‌బాబు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పెదకాకాని: యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని గ్రంథాలయాధికారి వేముల విజయకుమార్ తెలిపారు. పెదకాకాని గ్రంథాలయంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులతో యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మిక భావాలు పెంపొందుతాయని చెప్పారు.పలు రకాల యోగా చేయడం ద్వారా శ్వాస, మానసిక వ్యాధుల నుంచి స్వస్థత కలుగుతుందని వివరించారు.

మానసిక ప్రశాంతత .. ఆరోగ్యం

ప్రత్తిపాడు: యోగాతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం లభిస్తుందని రోటరీ క్లబ్ ఆఫ్ సెంటినీయల్ ప్రెసిడెంట్ కందిమళ్ల స్వప్న అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట మలినేని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ విభాగాధిపతి పి. కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ట్రైనర్ కందిమళ్ల స్వప్న మాట్లాడుతూ చదువుపై ఏకాగ్రత పెంచుకోవడానికి యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థి దశలో దురలవాట్ల బారిన పడకుండా కూడా యోగ ఉపకరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు, అకడమిక్స్ డీన్ జె. కిశోర్ బాబు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు షేక్ జిలాని, సుబ్బారావు పాల్గొన్నారు.

మిట్టపల్లి కళాశాలలో..

ప్రత్తిపాడు మండల పరిధిలోని తుమ్మలపాలెం మిట్టపల్లి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల జాతీయ సేవాసమితి, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం. నాగేశ్వరరావు హాజరయ్యారు. యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. పలు యోగాసనాల్ని విద్యార్థులతో వేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. గోపీకృష్ణ, ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

చేబ్రోలు: ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని అదృశ్యంపై బుధవారం చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు ప్రెసిడెన్సీ హైస్కూల్ సమీప ప్రాంతానికి చెందిన చందు మోనీషా గుంటూరు చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. మంగళవారం రాత్రి ఇంటి నుంచి అదృశ్యమైంది. తల్లిదండ్రులు బంధువులు సమీప ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి. వెంకటాద్రి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

పెదకాకాని: మండలంలోని కొప్పురావూరు శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం రాత్రి దాడులు చేశారు. పది మందిని అరెస్టు, వారి నుంచి రూ. 36 వేలు స్వాధీనం చేసుకున్నారు. మరి కొందరు పరారీ అయ్యారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు

గుంటూరు ఈస్ట్: గంజాయి విక్రయిస్తున్న మహిళపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శశాంక్ గోయల్ కాలనీలో బేబి గంజాయి విక్రయిస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం దాడి చేసి ఆమెను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఆమె నుంచి కేజీ వంద గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్, రూ. 1500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. బ్రాడీపేట వాటర్ ట్యాంకుల సమీపంలో సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం దాడి చేశారు. మల్లెబోయిన శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రూ. 3,400తో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నపై తమ్ముడు దాడి

పట్నంబజారు: అన్నపై తమ్ముడు కత్తితో దాడి చేసిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాచిరాజు వీధిలో నివాసం ఉండే భాస్కర్‌రెడ్డిపై అతని సోదరుడు నరేంద్రరెడ్డి కుటుంబ కలహాల నేపథ్యంలో కత్తితో దాడి చేసి గాయపరిచాడు. బుధవారం వారి తండ్రి వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



విద్యార్థినిని అభినందిస్తున్న ఎంపీపీ దాసరి అన్నమ్మ, హెచ్‌ఎం తదితరులు

కొండేపాడు (ప్రత్తిపాడు): విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ దాసరి అన్నమ్మ అన్నారు. మండల పరిధిలోని కొండేపాడు ఎల్ఈ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న దాసరి అక్షయ ఏపీఆర్ఎస్ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష పరీక్షలో వందకు 74 మార్కులు సాధించి, జిల్లా స్థాయిలో 73వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా బుధవారం స్థానిక పాఠశాలలో హెచ్‌ఎం శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినికి అభినందనలు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ అన్నమ్మ అక్షయను దుశ్శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వై.ఎస్. జగన్ చిత్తశుద్ధితో విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని చెప్పారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పరీక్షకు మొత్తం 2300 మంది విద్యార్థులు హాజరవ్వగా తమ విద్యార్థి వందలోపు ర్యాంకు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు దాసరి చెంచు రామారావు, ఉపాధ్యాయులు కె. శ్రీనివాసరావు, అంగన్ వాడీ కార్యకర్త వై. యశోద పాల్గొన్నారు.

ఇద్దరు అధ్యాపకులకు డాక్టరేట్లు



శివకుమార్



హరీష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాధిక

గుంటూరు రూరల్: విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు అయినంపూడి హరీష్‌కు విట్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన ధూళి రవీంద్ర పర్యవేక్షణలో ఫర్ఫార్మెన్స్ అనాలసిస్ అఫ్ స్కేలబుల్ యూజర్ సెంట్రిక్ హెట్రో జీనియర్ క్లౌడ్ అనే అంశంపై పరిశోధన చేశారు. పెదపలకలూరులోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీష్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక, అధ్యాపకులు అభినందించారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకునికి...

ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ కొమ్మెర శివకుమార్‌కు విశ్వేశ్వరయ్య సాంకేతిక విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన ‹ఏ నోవెల్ అప్రోచ్ ఫర్ వీడియో కంప్రెషన్ యూజింగ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్› అనే అంశంపై పరిశోధన చేశారు. చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, కార్యదర్శి ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్ అభినందించారు.

26న కెమిస్ట్రీ గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

నగరంపాలెం: ప్రభుత్వ మహిళా కళాశాలలో ఖాళీగా ఉన్న రెండు కెమిస్ట్రీ లెక్చరర్ (గెస్ట్ ఫ్యాకల్టీ) పోస్టులకు ఈనెల 26న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్. జ్యోత్స్నకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు సాంబశివపేటలోని కళాశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అభ్యర్థులకు పీజీలో 55 శాతం పైబడి మార్కులు ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరవ్వాలని ప్రిన్సిపాల్ సూచించారు.

బక్రీద్‌ను సుహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలి

మేయర్ కావటి




ముస్లిం మత పెద్దలు, గో సంరక్షణ సమితి నాయకులతో సమావేశమైన మేయర్ కావటి

నెహ్రూనగర్: నగరంలో బక్రీద్ పండుగను సుహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలని, నగర పాలక సంస్థకు ముస్లిం మత పెద్దలు సహకరించాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్‌నాయుడు కోరారు. నగరపాలక సంస్థలోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఈ నెల 29న జరగనున్న బక్రీద్ పండుగ నిర్వహణపై ముస్లిం మత పెద్దలు, గో సంరక్షణ సమితి సభ్యులు, పోలీస్, రెవెన్యూ, పశు సంవర్ధక శాఖ, నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ ఆరోగ్యకర వాతావరణంలో జరుపుకోవాలని, ప్రభుత్వ నియమ, నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన కోరారు. అనధికార జంతు వధ నిషేధమని, నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన వధశాలను వినియోగించుకోవాని తెలిపారు. జంతు వధశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. ఈద్గాల వద్ద ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ప్రజారోగ్య అధికారుల్ని ఆదేశించారు. పండుగ సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నగరపాలక సంస్థ, పోలీసు, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖల సమన్వయంతో ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాసరావు, సీఎంవోహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, డీఎస్పీ ఉమా మహేశ్వరరెడ్డి, కార్పొరేటర్లు ఖాజా మొహిద్దీన్ చిష్టి, షేక్ మీరావలి, రామనబోయిన అజయ్, వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, గోసంరక్షణ సమితి సభ్యులు ప్రదీప్ జైన్, సురేష్ జైన్, నిఖిల్ జైన్, గుంటూరు అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ కర్నూమ, సెక్రటరీ అబ్దుల్ సలాం, హిదయతుల్లా పాల్గొన్నారు.

నేడు పెద్ద మసీదులో బహిరంగ విచారణ

లక్ష్మీపురం: సుప్రసిద్ధ షాహి జామియా మస్జిద్ (పెద్ద మసీదు)లో బహిరంగ విచారణకు రాష్ట్ర మైనారిటీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ గురువారం ఉదయం 11 గంటలకు హజరుకానున్నారు. మసీదు ఆస్తులు, భూములపై కమిషన్‌కు అనేక ఫిర్యాదులు అందిన నేపథ్యంలో బహిరంగ విచారణ చేయాలని ఆయన నిర్ణయించారు. ఆయనతో పాటు కమిషన్ వైస్ చైర్మన్ డాక్టర్ ఏ. జాషుబా డానియేల్, సభ్యులు సయ్యద్ హిదాయతుల్లా, షేక్ సైఫుల్లా, జితేందర్ జీత్‌సింగ్ హాజరవుతున్నట్లు కమిషన్ కార్యాలయ అధికారులు బుధవారం వెల్లడించారు. మసీదుకు సంబంధించిన ఫిర్యాదుల్ని స్థానికులు రాతపూర్వకంగా కమిషన్‌కు అందజేయవచ్చని తెలిపారు. మైనార్టీ కేటగిరీకి వచ్చే ముస్లింలు, క్రైస్తవులు, జైనులు, సిక్కులు, పారసీల సమస్యల్ని కమిషన్‌కు నేరుగా నివేదించవచ్చని తెలియజేశారు.

కొనసాగుతున్న విద్యా సంస్థల బస్సులు తనిఖీ



పట్నంబజారు: విద్యా సంస్థల బస్సులపై రవాణా శాఖ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. గుంటూరు నగరంలోని చుట్టుగుంట, కాకాని రోడ్డు, రింగ్‌రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో బుధవారం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు (ఎంవీఐలు) తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని ఆరు బస్సులపై కేసు లు నమోదు చేశారు. ఇప్పటి వరకు 67 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ నిత్యం జిల్లా వ్యాప్తంగా ఏదో ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.